క్లుప్తంగా

నిందితులను శిక్షించాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: సొంత అల్లుడిని కుటుంబ సభ్యులతో కలసి కాళ్లు చేతులను తాళ్లతో కట్టేసి అతి కిరాతకంగా నరికి చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు. సోమవారం నగరంలోని వైఎస్‌ఆర్‌ మెమోరియల్‌ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలల నుంచి చాంద్‌ బాషా దంపతుల మధ్య కుటుంబంలో కలహాలు ఉండేవని, ఈ విషయమై పోలీస్‌ స్టేషన్లోనూ, పెద్దమనుషుల తోనూ పంచాయతీలో జరుగుతున్న నేపథ్యంలో కువైట్‌ నుంచి వచ్చిన వారి మామ ఆ ప్రాంత విందులో ఉన్న చాంద్‌ బాషాను నడిరోడ్డుపై కొట్టుకుంటూ దారుణంగా హత్య చేయడం ఎంతో విచారకరమన్నారు. పోలీసులు దీనిపై లోతైన విచారణ చేపట్టాలని దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాగబుల్‌ బాషా, మడగలం ప్రసాద్‌, పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కడప జిల్లా కలెక్టరేట్‌ స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌ఆర్టీసీ ఔట్‌ సోర్సింగ్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు మాట్లాడుతూ ఆర్టీసీ కాంట్రాక్టు 7300 మంది కార్మికులు కాంట్రాక్ట్‌ వ్యవస్థ థర్డ్‌ పార్టీ విధానంలో పని చేస్తున్నామన్నారు. థర్డ్‌ పార్టీ విధానం వల్ల చాలా నష్టపోతున్నామని, ఆర్టీసీలో థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కూటమి ప్రభుత్వం ఔట్‌ సోర్సింగ్‌ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్‌ అండ్‌ ఔట్‌ సోర్సింగ్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు విజయ్‌, జిల్లా నాయకులు శ్రీనివాసులు, సోమశేఖర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో పాఠశాలలు ప్రారంభించక ముందే విద్యార్థులకు యాజమాన్యాలు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. సోమవారం కడప కలెక్టరేట్‌ గ్రీవెన్స్‌ కార్యక్రమంలో ఆ మేరకు స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ వెంకటపతికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యాసంస్థలలో ఉన్న తరగతి గదులలో దుమ్ము, ధూళి, వర్షానికి విషపురుగులు వంటివి చేరి ఉంటాయన్నారు. గదులను శుభ్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర నాయకులు ఉదయ్‌, అఖిలేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చమ్మ ఇంటి కూల్చివేతదారులను శిక్షించాలి

కడప కార్పొరేషన్‌ : కడప శివానందపురం ఎస్సీ కాలనీలో వృద్ధురాలు పిచ్చమ్మపై దాడి చేసి ఇంటిని జేసీబీతో కూల్చిన వారిపై నాన్‌ బెయిలబుల్‌ క్రిమినల్‌ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జై భీమ్‌ మాల మహాసేన రాష్ట్ర అధ్యక్షులు పల్లెకొండు సంపత్‌ కుమార్‌, ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్‌ చేశారు. సోమవారం పిచ్చమ్మను పరామర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ నిలువ నీడ కోల్పోయి పోలియో కూతురుతో నిస్సహాయంగా ఉన్న వృద్ధ మహిళకు దళిత సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలిచి ఆమెకు పూర్తి న్యాయం జరిగే వరకు అండగా ఉండాలని కోరారు. జై భీమ్‌ మాల మహాసేన తరఫున ఆమెకు అండగా ఉంటామన్నారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి



కడపలోని ప్రభుత్వ బాలుర గృహంలో పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్‌: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్‌. బాబా ఫకృద్దీన్‌ తమ సిబ్బందితో కలిసి సోమవారం కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం పరిశీలించారు. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్య విలువైనదనీ, క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేసవిలో పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు. లీగల్‌ సర్వీసెస్‌ హెల్ప్‌ లైన్‌ నెంబర్‌ 15100, చైల్డ్‌ లైన్‌ హెల్ప్‌ లైన్‌ నెంబర్‌ 1098 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్‌ వీరయ్య, వైద్యాధికారిణి డాక్టర్‌ లక్ష్మీ పాల్గొన్నారు.

మొదలైన రేషన్‌ కష్టాలు

కడప నగరంలోని రేషన్‌కార్డుదారులకు కష్టాలు తప్పడం లేదు. వరుసగా రెండవరోజు కూడా నిత్యావసర సరుకులు తీసుకునేందుకు వెళ్లిన ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. సోమవారం ఉదయం నుంచి రేషన్‌ షాపుల వద్ద క్యూలో నిలబడినా సర్వర్‌ సమస్య కారణంగా చాలాసేపటి వరకు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మరోవైపు రేషన్‌ సరుకులు తీసుకున్నాక వాటిని ఇంటికి తీసుకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడ్డారు. వైఎస్‌ఆర్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే వచ్చి రేషన్‌ ఇచ్చేవారని.. ఆ పద్ధతే చాలా బాగుందని ప్రజలు అంటున్నారు. - ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్‌, కడప



ఎన్జీఓ కాలనీలో తెరుచుకోని రేషన్‌ షాపు



నకాష్‌లో సర్వర్‌ పనిచేయక క్యూలో ప్రజలు



హౌసింగ్‌బోర్డు కాలనీలో తెరవని రేషన్‌షాపు



శివలింగంపల్లె వీధిలో సర్వర్‌ మొరాయింపు



నాగరాజుపేటలో సర్వర్‌ పనిచేయక ఇక్కట్లు



కడప నగరం మంగళవీధిలోని రేషన్‌ షాపు వద్ద..



కడప నగరం 35 వ డివిజన్‌ వద్ద రేషన్‌ కార్డుదారుల పడిగాపులు

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



బుల్లెట్‌ వాహనం నుంచి శబ్ద కాలుష్యంను కలిగించే సైలెన్సర్‌ను తీసివేయిస్తున్న ఎస్‌ఐ

కడప అర్బన్‌: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలను తీసుకుంటామని కడప ట్రాఫిక్‌ ఎస్‌ఐ యు.వై జయరాములు హెచ్చరించారు. సోమవారం ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఎస్‌.ఐ యు.వై జయరాములు దాడులను నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాల నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్‌ వాహనాల సైలెన్సర్‌ లు మార్చి నడుపుతున్న వారికి జరిమానా విధించారు. బైక్‌ ల సైలెన్సర్‌ లను తీసివేయించిన తరువాత మరోసారి శబ్ద కాలుష్యం చేసే ఇతర సైలెన్సర్‌ లు వాడితే బైక్‌ సీజ్‌ చేస్తామని ఆయన హెచ్చరించారు.

క్యారమ్స్‌ శిక్షణ శిబిరాలు విజయవంతం



క్యారమ్స్‌ పోటీలో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్‌: కడప పట్టణంలో డీఎస్‌ఏ సహకారంతో ఇండోర్‌ స్టేడియం, మున్సిపల్‌ ఉర్దూ పాఠశాలలలో ఉచితంగా నిర్వహించిన క్యారమ్స్‌ ఉచిత శిక్షణా శిబిరం విజయవంతం అయిందని కోచ్‌లు పోలంగి గణేష్‌బాబు, సురె క్రిష్ణయ్య తెలిపారు. మే 1వ తేదీ నుంచి జూన్‌ 2వ తేదీ వరకు నిర్వహించిన క్యారమ్స్‌ పోటీల్లో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేసవి శిబిరంలో 40 మంది శిక్షణ పొందినట్లు కోచ్‌లు తెలిపారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ తీసుకుని జిల్లాస్థాయిలో క్యారమ్స్‌ పోటీలకు అర్హత సాధించారన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలలో అక్కడి నుంచి జాతీయస్థాయి పోటీలకు చేరుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఆదివారం ఫ్రీగా క్యారమ్స్‌ క్యాంపు కడప ఇండోర్‌ స్టేడియంలో ఉంటాయని కోచ్‌లు తెలిపారు. వివరాలకు 8297059998 సంప్రదించాలని సూచించారు.

మానవ హక్కుల కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సయ్యద్‌ జహీర్‌ అబ్బాస్‌ ఖాదీరి

కడప కల్చరల్‌ : షా సోషల్‌ జస్టిస్‌ ఫర్‌ ఇంటర్నేషనల్‌ సివిల్‌ అండ్‌ హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ కార్యాలయాన్ని సోమవారం స్థానిక సంస్థ ఇన్‌ఛార్జి, మహారాష్ట్ర ప్రతినిధి సయ్యద్‌ జహీర్‌ అబ్బాస్‌ ఖాదీరి, కౌన్సిల్‌ జిల్లా లీగల్‌ అడ్వైజర్‌ అలీమ్‌ అసద్‌ జాతీయ డైరెక్టర్‌ ఆస్మాలు ప్రారంభించారు. నగరంలోని రెండవ గాంధీ బొమ్మ వద్దగల ఈ కార్యాలయం ప్రారంభోత్సవంలో నగర ప్రముఖులు, కౌన్సిల్‌ ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర అధ్యక్షులు షేక్‌ అలీ షేర్‌, కౌన్సిల్‌ కడప జిల్లా అధ్యక్షులు షాబుద్దీన్‌, కౌన్సిల్‌ రాష్ట్ర సలహాదారులు బషీర్‌ బుఖారి, జన వికాస్‌ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు తాహిర్‌ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసమే అవగాహనతో ముందడుగు వేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి కష్టాలు ఎదురైనా వాటి పరిష్కారం కోసం తమవంతుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్‌ సభ్యులు తదితరులు పాల్గున్నారు.

ఏడాదిలో ఒక్క హామీనైనా నెరవేర్చారా..?

– మేయర్‌ సురేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్‌ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్‌ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని నగర మేయర్‌ సురేష్‌బాబు సూటిగా ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం స్థానిక అపూర్వ కల్యాణ మండపంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషతో కలిసి కార్పొరేటర్లు, డివిజనల్‌ ఇన్‌ఛార్జిలు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌ కల్యాణ్‌, బీజేపీ కలిసి ప్రజలకు సూపర్‌సిక్స్‌ హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని నమ్మబలికినా గతేడాది ఒక్క సిలిండర్‌ కూడా ఎవరికీ నగదు బదిలీ కాలేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేకుండా పోయిందని, ఆడబిడ్డ నిధి పథకం అటకెక్కిందని విమర్శించారు. రైతు భరోసా అడ్రస్‌ లేకుండా పోయిందని, పెన్షన్లు తప్ప ఈ ప్రభుత్వం మరే పథకాలు అమలు చేసిన పాపాన పోలేదన్నారు. తాము దారుణంగా మోసపోయామని ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోందని, ఈ ప్రభుత్వానికి సరైన సమయంలో వారు బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఈనెల 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ప్రజలంతా పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేతివృత్తుల విభాగం అధ్యక్షులు శ్రీకాంత్‌, పార్టీ నేతలు యానాదయ్యతోపాటు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’ విజయవంతం చేయాలి

– రాష్ట్ర చేతివృత్తుల విభాగం అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్‌

కడప కార్పొరేషన్‌ : వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్‌ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో అనుబంధ విభాగాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 జూన్‌ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు వచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, 2025 జూన్‌ 4 నాటికి ఏడాది పూర్తవుతుందన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీలు కూడా అమలు చేయలేదన్నారు. పైగా ఉన్న పథకాలు తీసేశారని , ఉద్యోగాలను తొలగించారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ విషయాలను ప్రజలందరికీ వివరించి పెద్ద ఎత్తున వారు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు సంబటూరు ప్రసాద్‌ రెడ్డి, ఎం శివరాం, ఎస్‌ వెంకటేశ్వర్లు, టిపి వెంకటసుబ్బమ్మ, రామకృష్ణారెడ్డి, జాషువా, దస్తగిరి, సాయి దత్త పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తోలేటి శ్రీకాంత్‌

సూపర్‌ సిక్స్‌ పథకాలు అమలు చేయాలి

– ధర్నాలో సీపీఐ నాయకుల డిమాండ్‌



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్‌ సిక్స్‌ పథకాలను సత్వరమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్‌ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా హామీలు అమలు చేయాలని కోరుతూ సోమవారం సీపీఐ నాయకులు కడప తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చంద్ర మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇళ్లను ఇస్తామని, ఇంటి స్థలం మంజూరు చేస్తామని, రేషన్‌ కార్డుతో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధి లైట్లు, 24 గంటలు తాగునీరు అందిస్తామని ఊక దంపుడు ఉపన్యాసాలతో ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే విస్మరించడం తగదన్నారు. దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు, అధికార పార్టీ నేతల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదన్నారు. భూమి లేని నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. సూపర్‌ సిక్స్‌ పథకాల అమలు సత్వరమే చేపట్టకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమాలకు సమాయత్తమవుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌ నారాయణరెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌ వెంకటశివ, నగర సహాయ కార్యదర్శిలు బాదుల్లా, మద్దిలేటి , నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాల కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్‌ జ్ఞానేశ్వరి

కడప ఎడ్యుకేషన్‌: యోగా చేయడం వల్ల ఆరోగ్యభాగ్యం కలుగుతుందని ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు యోగాసనాల్లో భాగంగా అధ్యాపకుడు అమృతరాజు సూర్య నమస్కారాలను చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ యోగా ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. యోగాతో విద్యార్థుల్లో చైతన్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ అధ్యాపకులు హబీబుల్లా, ఎన్‌ఎస్‌ఎస్‌ ఆఫీసర్‌ రాజారావు, అధ్యాపకులు సుధాకర్‌ రెడ్డి, శ్రీరాముల రెడ్డి, పద్మావతి, రోజమ్మ, చంద్రమౌళి, రామసుబ్బయ్య, యోగీశ్వరరెడ్డి, హరిక్రిష్ణా తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులలో ప్రభుత్వ తీరు మారాలి



మాట్లాడుతున్న రామకృష్ణంరాజు

కడప ఎడ్యుకేషన్‌: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులన్నీ సెకండరీ గ్రేడ్‌ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని నోబుల్‌ టీచర్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏబీ రామకృష్ణంరాజు, రామసుబ్బన్నలు డిమాండ్‌ చేశారు. సోమవారం కడప ఎన్‌టీఏ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేటాయించిందన్నారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేవలం పదోన్నతి ద్వారా మాత్రమే భర్తీ చేయాలి అనే నిబంధన ఉన్నప్పటికీ, సదరు పోస్టులను డైరెక్ట్‌ రిక్రూట్మెంట్‌ (డీఎస్సీ) ద్వారా కేటాయిస్తున్నారనే సమాచారం రావడం చాలా ఆక్షేపణీయమని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ జిల్లా గౌరవాధ్యక్షులు కూరాకు రవీంద్ర, జిల్లా ఆర్థిక కార్యదర్శి అవధానం చలపతి రాజు, రాష్ట్ర కౌన్సిలర్లు అబ్దుల్‌ గఫూర్‌, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత

నగరంలోని బళ్లారిరోడ్డులో శివలింగం బీడి ఫ్యాక్టరీ వద్ద ఉన్న ప్రమాదకర గుంత గురించి సాక్షిలో ‘ఆదమరిస్తే అంతే’ అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గుంతను పూడ్చివేశారు. స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. – ఫొటో: సాక్షిఫొటోగ్రాఫర్‌, కడప



ప్రమాదకరంగా ఉన్న గుంత



గుంతను పూడ్చిన తర్వాత..

పెండింగ్‌ వేతనాలు మంజూరు చేయాలి

కడప కార్పొరేషన్‌ : కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మున్సిపల్‌ కార్మికులకు రెండు నెలలు పెండింగ్‌ వేతనాలు తక్షణమే మంజూరు చేయాలని సీఐటీయూ కడప మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్‌ చేశారు. సోమవారం ఈ మేరకు మున్సిపల్‌ కార్మికులు నగరపాలక సంస్థ కమిషనర్‌ కి వినతి పత్రం సమర్పించారు. సుంకర రవి మాట్లాడుతూ అరకొర వేతనాలతో ఉద్యోగాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో పెట్టడం అన్యాయమన్నారు. తక్షణమే నిధులను విడుదల చేయాలన్నారు. జూన్‌ మాసంలో పిల్లల్ని స్కూళ్లు, కాలేజీల్లో చేర్పించడానికి డబ్బులు చాలా అవసరమని, నగరపాలక సంస్థ వేతనాలు ఇవ్వకపోతే బయట వ్యక్తుల దగ్గర వడ్డీలకు తీసు కోవాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. అలాగే నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు 010 పద్దుల్లో వేతనాలు ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు రైట్‌ టు ఎడ్యుకేషన్‌ యాక్ట్‌లో భాగంగా 50 శాతం ఫీజు రాయితీతో ప్రైవేట్‌ విద్యారంగంలో రాయితీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్‌ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బలహీనవర్గాలపై దాడులు బాధాకరం

కడప రూరల్‌ : తెలుగుదేశం పార్టీ కూటమిపాలనలో బడుగు బలహీన వర్గాలపై దాడుల తీవ్రత పెరగడం ఆందోళన కలిగిస్తుందని మహాజన రాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షులు సంగటి మనోహర్‌ అన్నారు. రాష్ట్రం విభజన జరిగి 12 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా సోమవారం స్థానిక వైయస్సార్‌ మెమోరియల్‌ ప్రెస్‌ క్లబ్‌ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ లతోపాటు మహిళలు ఇతర అణగారిన వర్గాలపై దాడుల తీవ్రత విపరీతంగా పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కాకినాడ, పిఠాపురం, తెనాలిలో జరిగిన సంఘటన ఉదాహరణగా చెప్పుకోవచ్చు అని పేర్కొన్నారు. ఈ దాడులు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరగడం దారుణమని తెలిపారు. అలాగే ఈ ప్రభుత్వానికి బలహీన వర్గాల సంక్షేమం ఏ మాత్రం కట్టడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రామకృష్ణ యాదవ్‌, షేక్‌ హుమేర, ఖాజా మొహిద్దిన్‌, సయ్యద్‌ ఆసిఫ్‌, ఓబులేసు, దేవర శ్రీకష్ణ పాల్గొన్నారు.

ప్రారంభమైన జేవీవీ ప్రచారం



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్‌ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ద్వారకనగర్‌లోని సంస్థ కార్యాలయంలో సభ్యత్వ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యాలయంలో సంస్థ జిల్లా అధ్యక్షులు సమీర్‌బాష ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నగర జేవీవీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని సూచించారు. ఈ మేరకు వారు ఇతర సభ్యులతో కలిసి జేవీవీ సభ్యత్వ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సమీర్‌బాష మాట్లాడుతూ జూలై 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించామన్నారు. ప్రచార పోస్టర్లతోపాటు సభ్యత్వ పుస్తకాలను కూడా కార్యకర్తలకు అందజేశారు. వీటి ద్వారా గ్రామ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. జేవీవీ ప్రజల్లో శాస్త్ర దృక్పథాన్ని, తర్క బద్ధమైన ఆలోచనను ప్రోత్సహించే సంస్థ అన్నారు. ఈ ఉద్యమంలో ప్రతిసభ్యుడు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, సీనియర్‌ నాయకులు వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షులు శివరాం, సభ్యులు సునీత, నరసింహారెడ్డి, ప్రకాష్‌, దస్తగిరి రెడ్డి, గౌరీ శంకర్‌, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌ ఫలితాల్లో ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్‌: జేఈఈ అడ్వాన్స్‌ ఫలితాల్లో కడప నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటి ఆల్‌ ఇండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించారు. ఇందులో స్వాతికా 892, ఐశ్వర్యారాజ్‌ 1133, వెంకటరామ్‌చరణ్‌ 1449, రోహిత్‌రెడ్డి 1646, ధనుష్‌ 1733, ధీరజ్‌కుమార్‌ 1962, నితిన్‌రెడ్డి 2627, అబ్దుల్‌ హసీమ్‌ 3199, ప్రణతిరెడ్డి 4323, జగత్స్మరన్‌ 5704, శ్రావణ్‌క్రిష్ణ 14701, ఉమర్‌ కైయుబ్‌ 17356, మహ్మద్‌ హసన్‌ 19400 ర్యాంకులను సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను నారాయణ డీజీఎం రామమోహన్‌రెడ్డి, కోఆర్డీన్‌ చంద్రకిషోర్‌రెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, డీన్స్‌ సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ప్రిన్సిపాల్స్‌ మురళీమోహన్‌, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్యం, రాఘవరెడ్డి, సుమన్‌లు విద్యార్థులను అభినందించారు.